

జీలుగుమిల్లిలో ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

నైరుతి రుతపవనాలు వచ్చి 15 రోజులు గడిచిన అనంతరం జీలుగుమిల్లి మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఒకపక్క ఎండ, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఉపశమనం కలిగినట్లైంది. ఈ వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. వాగులు వంకలలోకి నీరు చేరాయి. కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగుల గుండా వరద ప్రవాహం రావడంతో కాలువలు రహదారిపై ప్రవహించాయి. నారు మడుల్లోకి నీరు చేరాయి. రుతుపవనాలు వచ్చి ఇంతకాలం తర్వాత ఇదే పెద్ద వర్షం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు.

కొత్త కలెక్టర్లకు.. సరికొత్త సవాళ్లు..!


కలెక్టర్ వెట్రి సెల్వి


కలెక్టర్ నాగరాణి

- ప్రభుత్వం మారడంతో రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నిమామకం
- ఏలూరుకు వెట్రి సెల్వి, 'పశ్చిమ'కు సి.నాగరాణి
- ఏలూరు జిల్లాలో పోలవరం, చింతలపూడి, కొల్లేరు వంటి ప్రజల సమస్యలెన్నో
- పశ్చిమలో తాగునీరు, కాలుష్యం, కౌలు రైతుల సమస్యలు అనేకం
- తమదైన ముద్రవేసేలా అధికారులుగా ముందుకు సాగేనా?
- నేడు, రేపో బాధ్యతలు తీసుకునే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం మారింది. అధికారుల మార్పిడి మొదలైంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లాకు వెట్రి సెల్వి, పశ్చిమకు సి.నాగరాణి జిల్లా కలెక్టర్లుగా నియమితులయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కొత్త కలెక్టర్లు పట్టించుకోవాలని, తమదైన మార్క్ పాలన సాగిస్తారా అన్న చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరు పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రభుత్వంలోనైనా అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తారా అన్న చర్చ సాగుతోంది. ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్య ప్రధానమైనవని చెప్పొచ్చు. ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించకుండా కాఫర్ డ్యాం పూర్తిచేశారు. దీంతో ఏటా జులై, ఆగస్టు నెలల్లో వచ్చే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు వందకు పైగా గ్రామాలు నీటమునుగుతున్నాయి. అక్కడి ప్రజలు చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు బతుకులు మారిపోతున్నాయి. దీంతో వరద బాధితులుగా మారిన నిర్వాసితులను ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న వెట్రి సెల్వి నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సి ఉంది. వరదలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అక్కడి ప్రజలను ఆదుకోవాల్సి ఆవశ్యకత ఉంటుంది. చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగడం లేదు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలి. కొల్లేరులో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ చెరువుల తవ్వకాలను నిరోధించాలి. కొల్లేరు ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. ధ్వంసం చేసిన పట్టా భూములను తిరిగి కొల్లేరు బాధిత రైతులకు అప్పగించాలి. కొల్లేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన పంటలు మొక్కజొన్న, ఆయిల్‌పామ్, వరి వంటి పంటలు పండించే రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో పాడైపోయిన రోడ్లను బాగుచేయాలి. ఆక్వాసాగుతో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. వ్యవసాయ ఆధారిత పంటలను నిర్మించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఇంకా అనేక సమస్యల పరిష్కారం వంటివి కొత్త కలెక్టర్‌కు సవాలుగా మారనున్నాయి.

'పశ్చిమ'లో ప్రధాన సమస్యలు ఎన్నో


పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్న సి.నాగరాణికి అనేక సమస్యల సవాళ్లు ముందున్నాయి. ఈ జిల్లాలో లక్షల సంఖ్యలో కౌలు రైతులు ఉన్నారు. వీరికి కౌలుకార్డుల జారీ, బ్యాంకు రుణాల అందజేత వంటివి సక్రమంగా జరగడం లేదు. వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నా న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. కౌలురైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. జిల్లాలో ఆక్వాసాగు ఎక్కువగా ఉంది. దీంతో ఆక్వా, ఇతర పరిశ్రమల నుంచి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. దీంతో జిల్లాలో కేన్సర్, కిడ్నీ రోగులు పెరుగుతున్న పరిస్థితి కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణను అరికట్టేందుకు కలెక్టర్ పనిచేయాలని అంతా కోరుతున్నారు. ఆక్వా రైతులకు ధర విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆక్వా రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆక్వా యూనివర్శిటీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంది. నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వంటివాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. అస్తవ్యస్తంగా మారిన రోడ్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలి. డెల్టా ఆధునికీకరణ పనులపై దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలి. ప్రజాసంఘాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. బదిలీ అయిన జిల్లా కలెక్టర్ సుమిత్ గాంధీ కొద్దికాలం మాత్రమే పనిచేసినప్పటికీ ప్రజల ఆదరణ పొందడం విశేషం. కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ సైతం తనదైన ముద్ర పాలనలో చూపించాలని అంతా కోరుతున్నారు.

ఇంటర్లో ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు

జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్





2024 - 25 సంవత్సరానికి గాను ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లాలో ఎన్ని ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి? గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం ఎంత? ప్రయివేటు కళాశాలలో ఫీజుల నియంత్రణకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : జిల్లాలో ఏయే యాజమాన్యాల పరిధిలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి?

జిల్లాలో మొత్తం 122 ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో 19 ప్రభుత్వ కళాశాలలు, ఆరు సాంఘిక సంక్షేమ కళాశాలలు, మూడు గిరిజన సంక్షేమ కళాశాలలు, రెండు కస్తూరిబా బాలిక విద్యాలయాలు, రెండు ఎయిడెడ్ కళాశాలలు, 90 ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాల్లో మొత్తం ఎంతమంది అధ్యాపకులు ఉన్నారు? వారిలో రెగ్యులర్ అధ్యాపకులు ఎంతమంది? కాంట్రాక్టు అధ్యాపకులు ఎంతమంది?

ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం 290 మంది అధ్యాపకులు ఉండగా అందులో 90 మంది రెగ్యులర్ అధ్యాపకులు, మిగిలిన రెండు వందల మంది కాంట్రాక్టర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు.

ప్రశ్న: 69 శాతం కాంట్రాక్టు అధ్యాపకులే ఉన్నారు. రెగ్యులర్ అధ్యాపకులు కేవలం 31 శాతం మాత్రమే, ఈ సంవత్సరం వారికి ఇంకా పునర్ నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. మరి విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధిస్తున్నారు?

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి. త్వరలో వస్తాయి. ప్రస్తుతం కాంట్రాక్టు అధ్యాపకులు కళాశాలలకు వచ్చి బోధిస్తున్నారు. జూన్ 1 నుంచి రెన్యువల్ అమలు చేస్తూ ఉత్తర్వులు త్వరలో రావొచ్చు.

ప్రశ్న: మొత్తం ఎంతమంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారు? మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయా?

జిల్లాలో ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో ఇంకా ఓపెన్ చేయలేదు. ఈ నెలాఖరుకు మొదటి ఫేజ్ పూర్తి కావొచ్చు.

ప్రశ్న : ప్రస్తుతం కళాశాలలకు వస్తున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ పూర్తయిందా?

ఇంకా పుస్తకాలు పంపిణీ జరగలేదు. వచ్చే నెల 15వ తేదీ లోపు పూర్తి చేస్తాం.

ప్రశ్న: ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతోందని విద్యార్థులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గతంలో ప్రభుత్వం ఫీజులు నియంత్రణ కోసం కమిటీ వేసింది. కానీ యాజమాన్యాలు కోర్టుకు వెళ్లి దానిపై స్టే తీసుకురావడంతో ప్రస్తుతం ఫీజులపై ఎలాంటి నియంత్రణ లేదు.

ప్రశ్న : స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్ స్కీంలో (గతంలో నాడు - నేడు) ఏ పనులు చేపట్టారు? పనులు ఎంతవరకూ వచ్చాయి?

ఈ స్కీమ్‌లో మొదటి విడతలో మన జిల్లాకు లేదు. రెండో విడతలో జిల్లాకు తొమ్మిది కోట్ల 87 లక్షల రూపాయలు మంజూరైంది. వాటిని 19 ప్రభుత్వ కళాశాలల్లో తరగతి గదులు, టాయిలెట్స్ మరమ్మతులు, నిర్మాణం, విద్యుదీకరణ వంటి పనులకు ఉపయోగించాం. దాదాపు పనులు పూర్తికావచ్చాయి.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలలో ఎంత ఫీజు అడ్మిషన్ కోసం తీసుకుంటున్నారు? ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రాయితీ ఉందా?

ప్రభుత్వ కళాశాలల్లో ఒసి అభ్యర్థుల నుంచి 2000 రూపాయలు అడ్మిషన్ ఫీజుగా తీసుకుంటున్నాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రూ.570 రూపాయలు రాయితీ ఇవ్వడం జరుగుతోంది.

ప్రశ్న : ఈ సంవత్సరం ఇంటర్ ఫలితాలు గత సంవత్సరంతో పోలిస్తే ఎలా వచ్చాయి? ఫలితాలు మెరుగుపర్చేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

గత సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 58 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, ఈ సంవత్సరం 67 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. 2024-25 సంవత్సరానికి 90 శాతం ఉత్తీర్ణత టార్గెట్‌తో చర్యలు చేపట్టాం. ఇందుకోసం కళాశాలలో స్టడీ అవర్స్ నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, రెగ్యులర్‌గా పేరెంట్స్ కమిటీ మీటింగులు నిర్వహించి విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఇంటి దగ్గర కూడా చదివించేలా ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రయివేటు కళాశాలల విద్యార్థులతో పోలిస్తే చదువులో వెనుకబడి ఉండటానికి కారణం ఏంటి?

ఎక్కువ గ్రామీణ ప్రాంతాల నుంచి రావడం, ఆర్థికంగా వెనుకబడి ఉండడం, సరైన సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాలుగా చెప్పొచ్చు. అయినప్పటికీ ప్రభుత్వ కళాశాలల్లో అద్భుతంగా రాణించే విద్యార్థులు ఉన్నారు. ఈ సంవత్సరం నారాయణపురం ప్రభుత్వ కళాశాలకు చెందిన అజయ్ రాజు అనే విద్యార్థి వెయ్యికి 985 మార్కులు సాధించి రాష్ట్రంలోనే రెండో ర్యాంక్ సాధించాడు. అలాగే పెదపాడు ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థిని కళ్యాణి 975 మార్కులు సాధించింది. వీరిద్దరూ అమరావతిలోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బిటెక్‌లో సీట్లు సాధించారు.

ప్రశ్న: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైస్కూల్లో ప్లస్ టు విధానం సరైన ఫలితాలు సాధించినట్లు లేదు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల కంటే దారుణంగా 33 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కారణం ఏంటి? జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో ప్లస్ టు విధానం ప్రవేశపెట్టారు?

జిల్లాలో 24 పాఠశాలల్లో ప్లస్ టు విధానం ప్రవేశ పెట్టాం. ప్లస్ టు అన్నది విద్యాశాఖ ఆధీనంలో హైస్కూల్లో ఏర్పాటు చేశాం. వారికి పాఠాలు చెప్పడం, పాఠశాలల నిర్వహణ అంతా విద్యాశాఖ ఆధీనంలోనే జరుగుతుంది. ఒక్క పరీక్షలు మాత్రమే ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా రాస్తారు. వారిపై మాకు ఎలాంటి నియంత్రణ లేదు.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ కళాశాలల్లోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది ద్వారా క్యాంపెయిన్ చేస్తాం. తక్కువ ఫీజుతో, ఉచిత పుస్తకాలతో నాణ్యమైన విద్య అందిస్తున్న విషయం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తాం.

దోసపాడు భూములను అప్పగించండి

జెసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలి - వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలు చూపుతున్న వ్యకాస నేతలు రవి, రామకృష్ణ

దోసపాడులో వాస్తవ అసైన్డ్‌దారులకు భూములు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను స్థానిక అన్నే భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 2016 నుంచి లోకయుక్తా ఇచ్చిన తీర్పు ఆధారంగా దోసపాడు పేదలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటాలు సుదీర్ఘ కాలం పాటు మూడు దశలుగా చేసినట్లు తెలిపారు. వివిధ రూపాల్లో సాగిన పోరాటంలో అధికారులు భూస్వాములిచ్చిన లంచాలు మింగి పేదలకు అన్యాయం చేయాలని చూశారని విమర్శించారు. అయినా పట్టు విడవని విక్రమార్కుల్లా దోసపాడు పేదలు, దళితులు వ్యవసాయ కార్మిక సంఘం అండతో పెద్ద ఎత్తున పోరాటాలు చేశారన్నారు. ఇదో గొప్ప విజయమని తెలిపారు. లోకయుక్తా తీర్పును ఎలాగైతే తప్పుదోవ పట్టించారో అలాగే రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పుడు ఈ తీర్పును భూస్వాములు ఇచ్చే లంచాలు తిని అలాగే చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వం పేదల పక్షాన ఉండాల్సింది పోయి భూస్వాముల పక్షాన నిలబడడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని, అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాస్ బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి చూపించి దానిపై వారికీ సర్వ హక్కులూ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పేదల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రెవెన్యూ శాఖ అధికారులు అమలు చేసేలా ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులు చేసిన తప్పిదాలకు ఎనిమిదేళ్ల నుంచి దోసపాడు పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎనిమిదేళ్ల నుంచి సాగు చేసుకున్న అవకాశం ఉన్న అవకాశాన్ని భూస్వాములకు అప్పజెప్పి రెవెన్యూ శాఖ అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ప్రభుత్వం రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో ఆలోచించి ఎవరైతే అసలైన అసైన్డ్‌దారులు ఉన్నారో వారికి పట్టాలు, పాస్‌బుక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం పోరాటాల ఫలితంగా దోసపాడు పేదలకు ఊరటనిచ్చే ఈ జడ్జిమెంట్ రేపు భూముల్లో సాగు చేసుకునే పంట వేసుకునే విధంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించాలని కోరారు. దోసపాడు పేదలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడంతోపాటు గ్రామాల్లో 144, 145 సెక్షన్ పెట్టి పేదలను పోలీసులు నిద్రాహారాలు లేకుండా చేశారని విమర్శించారు. పేదలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులను అధికారులు వెంటనే అమలు చేయాలనీ, భూములు ఎక్కడున్నాయో గుర్తించి సంబంధిత అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.ఆనందరావు, డి.నాగేంద్ర పాల్గొన్నారు.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఏలూరు


ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నేతలు

జులై 4వ తేదీన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఏలూరు పరిసరాల్లో 127 చోట్ల, 127 సంఘాలు, సంస్థలు కలిపి సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వివిధ సంఘాలు, సంస్థల ప్రతినిధుల సమావేశానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ఆహ్వానం పలికారు. ఈ సమావేశానికి మానవత పూర్వజిల్లా అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మరణించి 100 సంవత్సరాలు పైబడినా ఆయన జీవిత పోరాట పటిమ ఆదర్శప్రాయం అన్నారు. విద్యార్థులు, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే ప్రయత్నం చేద్దామన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం గురించి లఘు నాటికలు, ప్రదర్శన వీడియోలను ఎవరైనా 30వ తేదీ సాయంత్రం వరకూ పి.రవికిషోర్ 98482 15477 లేదా పవన్ 6303713878, డి.గణేష్ 93945 51636లో ఏదో ఒక వాట్సాప్ నంబర్‌కు పంపించాలన్నారు. 4వ తేదీన సాయంత్రం ఏలూరు కోటదిబ్బలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో జరిపే సభలో బహుమతులు ఇవ్వడానికి తీర్మానించినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జులై 3వ తేదీ వరకూ స్కూళ్లు, కాలేజీల్లో స్థానికంగా అల్లూరి సీతారామరాజు జీవితం, పోరాటం సంఘటనలపై డ్రాయింగ్ పోటీలు, ఏకపాత్రాభినయం, వేషధారణ పోటీలు ఆయా విద్యాలయాల వారు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జులై 3వ తేదీన, 4వ తేదీన మొత్తం 127కుపైగా విద్యాలయాల్లో అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాల వేసి వేలది మందితో సభలు సమావేశాలు జరపాలన్నారు. ఆయా సభలకు 127 సంఘాలకు చెందిన ప్రతినిధులు అతిథులుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సభలో వివిధ సంస్థలు, సంఘాలకు చెందిన విజిఎంవిఆర్.కృష్ణారావు, దువ్వి రామారావు, పి.సురేష్, ఎస్.కస్తూరి రావు, పెరియార్, ఎస్ఎన్.కట్టా, పి.రవీంద్ర, కె.లెనిన్, పి.దుర్గా ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

ప్రజల మనసులో ఆయనకు సుస్థిర స్థానం

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్‌గా ప్రసన్న వెంకటేష్ సేవలు భేష్
ఎన్నికల్లో ఆయన పాత్ర కీలకం
ఓటింగ్ శాతం పెరిగేందుకు కృషి


వరదల సమయంలో సహాయక చర్యల్లో కలెక్టర్ (ఫైల్‌ఫొటో)

ప్రసన్న వెంకటేష్ 2022 జనవరి 26న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి నాటి నుంచి జిల్లా యంత్రాంగంతో మమేకమై రాజీ పడకుండా విధులు నిర్వర్తించారు. తన పని తీరుతో సామాన్య ప్రజల్లో సైతం అందరి మనిషిగా కలెక్టర్ విధులు నిర్వహిస్తూ అటు ప్రజలు, ఇటు అధికారులు అందరిలో చెరగని ముద్ర వేసుకున్న అధికారి ప్రసన్న వెంకటేష్. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ వారి మన్ననలు పొందగలిగారు. పరిపాలనలో నిష్పక్షపాతంగా వ్యహరిస్తారని అన్ని వర్గాల్లో మంచి పేరు ఉంది. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఆయన తనదైన ముద్ర వేశారు. గతంలో గోదావరి వరదలు సంభవించిన సమయంలో సహాయ పునరావాస కేంద్రాల్లో దగ్గర ఉండి పర్యవేక్షించి బాధితులకు అండగా నిలిచారు. అలాగే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో చురుకైన పాత్ర పోషించారు. గిరిజన ప్రాంతాల్లో పౌష్టికాహారం అందించేందుకు సరికొత్త పథకాన్ని అమలులో తీసుకొచ్చారు. ప్రధానంగా చారిత్రాత్మక గోదావరి నదిలో వరదలు (గత 3-4 దశాబ్దాలలో కూడా అత్యధికం) రెండు సార్లు వచ్చాయి. వేలాది మందిని సకాలంలో రక్షించి, తరలించి సహాయక సేవలను అందించడంలో ప్రసన్న వెంకటేష్ సేవలు మరువలేనివి. మహిళలు, పిల్లల ఆరోగ్యం, పోషణపై దృష్టి సారించి ప్రాజెక్ట్ అక్షజ సెయింట్ థెరిస్సా కళాశాల సహకారంతో ఐటిడిఎ మండలాల్లో పోషకాహార లోపం ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న మహిళలకు సిఎస్ఆర్ చొరవ ద్వారా అనుబంధ పోషకాహారాన్ని అందించడంలో విశేష కృషి చేశారు. సిఎస్ఆర్ నిధుల కింద కలెక్టర్ వ్యక్తిగత ఆసక్తి ఆధారంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలల్లో ఐదు కొత్త లైబ్రరీల స్థాపన, రూ.45 లక్షలతో కోట దిబ్బ డిగ్రీ కళాశాలకు లెక్చర్ హాల్, జిల్లా అతిథి గృహం, ఉద్యోగుల కోసం జిమ్, నిరుపేద బాలల గృహం మొదలైనవి ఉన్నాయి. పిల్లలు లేని తల్లిదండ్రులను, అనాథ పిల్లలను దత్తత తీసుకునేలా ప్రేరేపించారు. కోవిడ్ అనాథ పిల్లలకు సహాయాన్ని అందించడంలో విశేష కృషి చేశారు.

కైకలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రభుత్వ భూముల ఆక్రమణలను తీవ్రంగా వ్యతిరేకించి కొత్త ఆక్రమణల నుంచి కొల్లేరును కాపాడడంలో అవిరళ కృషి చేశారు. ఆయుష్మాన్ భారత్ (భారత ప్రభుత్వం) కింద ఎన్‌సి డి-సి డి సర్వే, ఎబిహెచ్‌ఎ హెల్త్ కార్డ్‌లో ఏలూరు జిల్లా దేశంలోనే మొదటి స్థానంలో నిలవడంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సమర్థవంతమైన పనితీరుకు ఓ నిదర్శనం.

ఎన్నికల్లో ఆయన పాత్ర కీలకం

జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో జిల్లా ఎన్నికల అధికారిగా ప్రసన్న వెంకటేష్ కీలక భూమిక పోషించారు. జిల్లాలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముందుగానే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది కేటాయింపు, ఇవిఎంల నిర్వహణ ఇలా ప్రతి అంశంలోనూ ఆయన తీసుకున్న ముందస్తు చర్యలు అందరి మన్ననలు పొందాయి. జిల్లాలో గతంలో లేని విధంగా ఓటింగ్ శాతం పెరగడానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముందు చూపే కారణంగా చెప్పవచ్చు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కూడా జిల్లాలోనే అత్యధికంగా నమోదైంది. ఇందుకోసం ముందస్తుగానే ఆయన ప్రణాళిక బద్ధంగా ఉద్యోగులకు ఎక్కడ ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు కలిగే ఇచ్చే విధంగా ఆయన చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో జిల్లాలో హోమ్ ఓటింగ్ పెంచేందుకు ఆయన ముందస్తు ప్రణాళికలతో కిందిస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ వచ్చారు. దీంతోపాటు సాధారణ ఓటింగ్ కూడా 84.9 శాతం పైగా పెరగడానికి గడిచిన ఏడాదిగా ఆయన చేస్తున్న కృషికి నిదర్శనం.

విజయరాజుకు ఐఐటిలో సీటు

పలువురి అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి



ఈ ఏడాది జరిగిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ముదినేపల్లికి చెందిన విద్యార్థి బండి విజయరాజుకు తిరుపతి ఐఐటిలో సీటు లభించింది. ముదినేపల్లికి చెందిన బండి ఇమ్మానుయేలు (పాస్టర్) కుమారుడైన బండి విజయరాజు స్థానిక జెడ్‌పి హైస్కూల్లో పదో తరగతి పాస్ అయ్యాడు. అనంతరం కుంటు ముక్కల ఎపి రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణత సాధించి తిరుపతి ఐఐటిలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా ముదినేపల్లి, వడాలి జెడ్‌పి హైస్కూళ్ల ప్రధా నోపా ధ్యాయులు వి.విజయ్‌కుమార్, వి.ప్రభుదాసు, పలువురు ఉపాధ్యాయులు విజయరాజుకు అభినందనలు తెలిపారు.

సొసైటీల్లో స్తంభించిన కార్యకలాపాలు

త్రిసభ్య కమిటీ సభ్యుల రాజీనామాలతో రైతులకు ఇబ్బందులు

ప్రత్యేకాధికారులను నియమించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పిఎసిఎస్ (సొసైటీ)ల్లో కార్యకలాపాలు స్తంభించాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు గతంలో నియమించిన త్రి సభ్య కమిటీల సభ్యులు రాజీనామాలు చేయడంతో సొసైటీల్లో ప్రస్తుతం కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో సొసైటీల్లో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలంటే కార్యదర్శులకు పూర్తిస్థాయి అధికారం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. దీంతోపంట రుణాల కోసం రైతులు సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు. కౌలు రైతులు సైతం పంట రుణాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంట రుణాలు ఎప్పుడు మంజూరవుతాయోననే ఆశతో మండలంలోని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరితగతిన సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తే రుణాలు మంజూరు అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చేవూరు, వైవాక, గోకినంపాడు, బొమ్మినంపాడు, దేవపూడి, ఉప్పరగూడెం, ముదినేపల్లి, పెదపాలపర్రు, గురజ, పెనుమల్లి, దాకరం, చిగురుకోట, వాడవల్లి, కొరగుంటపాలెం, వడాలి సొసైటీలకు త్రి సభ్య కమిటీలు రద్దు అయ్యాయి. ఇప్పటికే ఆయా సొసైటీల పరిధిలో పంట రుణాలకు రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక అధికారులను నియమిస్తే తమకు పంట రుణాలు మంజూరు అవుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.


బడేటి చంటిని అభినందిస్తున్న మేయర్ నూర్జహాన్ పెదబాబు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా జనంతో మమేకమవుతూ పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా పనిచేసినప్పుడే ప్రజా హృదయాల్లో శాశ్వత స్థానం పొందవచ్చని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. హుందా రాజకీయాలకు పెద్దపీట వేస్తూ కార్పొరేషన్ పాలకవర్గం పెద్ద మనసుతో ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వానికి పూర్తి సహకారమందిస్తే ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తానని భరోసా ఇచ్చారు. ఏలూరులో ఆదివారం కార్పొరేషన్ పాలకవర్గం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలు తెలిపింది. ఎంఎల్ఎగా విజయం సాధించిన బడేటి చంటి హయాంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, దానిలో తాము కూడా భాగస్వాములు కావాలన్న ఏకైక లక్ష్యంతో ఏలూరు కార్పొరేషన్‌లోని వైసిపి పాలకవర్గం ఒక అడుగు ముందుకు వేసి ఎంఎల్ఎ బడేటి చంటికి స్నేహహస్తం అందించిందన్నారు. ఏలూరు పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఉదయం మేయర్ షేక్ నూర్జహాన్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పలువురు కార్పొరేటర్లు కలిసివచ్చి ఎంఎల్ఎ బడేటి చంటిని కలుసుకుని ఘనంగా సన్మానించారు. దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ రాజకీయాల్లో హుందాతనాన్ని పాటిస్తూ కార్పొరేషన్ పాలకవర్గం తనను అభినందించేందుకు వచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, ఆ తర్వాత అభివృద్ధే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలన్నారు. రాజకీయరంగ ప్రవేశం చేసిన నాడే తాను ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించుకున్నానని, దానికి కార్పొరేషన్ పాలకవర్గం కూడా సంపూర్ణ సహకారం అందిస్తే రానున్న రెండేళ్లలో అందరూ కలిసి కట్టుగా కృషిచేసి నగరాన్ని అభివృద్ధిపథంలో నడుపుదామని చెప్పారు. గడిచిన మూడేళ్లలో కార్పొరేషన్ పాలకవర్గం నిధుల లేమి కారణంగా అభివృద్ధి పనులను చేయలేకపోయిందని, ఈ విషయం ఎన్నికల్లో ప్రజాతీర్పు తేటతెల్లం చేసిందన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఏలూరు నగరాభివృద్ధికి ఎంఎల్ఎ బడేటి చంటికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చామని, అదే స్ఫూర్తితో నగరాభివృద్ధికి ఎంఎల్ఎతో కలిసి పునరాంకితమవుతామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

పాఠ్య పుస్తకాలు సక్రమంగా అందించాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థుల డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశించారు. పాఠ్య పుస్తకాలు సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు రావూరి కృష్ణ, హెచ్ఎం లావ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు


పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ముమ్మరంగా కాలువ పూడిక తీత పనులు

ప్రజాశక్తి - ముసునూరు

తమ్మిలేరు సబ్ ఛానల్ కాలువ పూడిక తీత పనులు అధికారులు ఆదివారం చేపట్టారు. పూడిక తీయాలని ఇటీవల మంత్రి కొలుసు పార్థసారధిని వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు గ్రామ ప్రజలు కోరారు. దీంతో ఆయన అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అధికారులు ఆదివారం పొక్లెయిన్‌తో సబ్ ఛానల్ పూడిక తీత పనులు మొదలుపెట్టారు. వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు నీరందించే ఈ సబ్‌ఛానల్ కాలువ పూడికతీత పనులు చేయటం వల్ల ఆ మూడు గ్రామాల ప్రజలు మంత్రి కొలుసు పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు.

కామవరపుకోట సొసైటీని అభివృద్ధి చేయాలి

సిపిఐ మండల కన్వీనర్ రాజు

ప్రజాశక్తి - కామవరపుకోట

కొందరు తమ వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాల కోసం కామవరపుకోట విశాల సహకార సంఘాన్ని నష్టాల్లోకి నెట్టినట్లు తమ దృష్టికి పలు అభియోగాలు వచ్చియని సిపిఐ కామవరపుకోట మండల కన్వీనర్ టిడిఎస్.రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిపై సమగ్ర విచారణ జరిపి సహకార సంఘానికి గత వైభవాన్ని తీసుకురావాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను ఆయన కోరారు. కొందరు తమ రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా పేరు తెచ్చుకున్న కామవరపుకోట విశాల సహకార సంఘం నిధులను స్వాహా చేశారన్నారు. ఎంఎల్ఎ రోషన్ కుమార్ ఈ సంఘంపై ప్రత్యేక దృష్టి సారించి దీని అభివృద్ధిని పునరుద్ధరించాలని కోరారు.

మానవత అధ్యక్షులుగా సీతారామాంజనేయులు

భీమడోలు : స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు యూనిట్ నూతన అధ్యక్షులుగా గుడివాడ సీతారామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రస్తుత అధ్యక్షులు వట్టి సుగుణాకర్ తెలిపారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి ఎంపికైన కార్యవర్గం జూలై ఒకటో తేదీ నుంచి విధులు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. భీమడోలులోని మానవత భవనంలో ఆదివారం సాయంత్రం యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి పరిశీలకులుగా జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధరరావుతో పాటు ఇతర సభ్యులు హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అధ్యక్షులతో పాటు కార్యదర్శిగా ఎ.ప్రసాదరావు, కోశాధికారిగా గోనుగుంట రమణ శంకర్, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాసరావు (బాబి), సంయుక్త కార్యదర్శిగా డి.పెద్ద చెన్నారావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పివి.రామకృష్ణ, బి.గణేష్‌కుమార్, చిలపర్తి ఆదినారాయణ, ఆర్.రామన్న ఎంపికయ్యారు. కార్యక్రమం కొనసాగింపులో భాగంగా భీమడోలు యూనిట్ తరపున ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల దక్కించుకున్న విద్యార్థులకు రూ.4,500 నగదు పురస్కారం, విద్యలో ప్రతిభ కనపర్చుతున్న సూరప్పగూడెం గ్రామానికి చెందిన బాలిక డిగ్రీ ఫీజు కోసం రూ.ఐదు వేల నగదును అందించారు. ఈ సందర్భంగా పలువురు నూతనంగా ఎన్నికైన యూనిట్ కార్యవర్గాన్ని అభినందించారు.

రహదారి విస్తరణ పనులు.. మృత్యు ఘంటికలు..!

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం
పామర్రు-దిగమర్రు రోడ్డు పనులతో ఇబ్బందులు
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు


గుంటలో పడి ప్రమాదానికి గురైన కారు


ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి విస్తరణ పనులు మృత్యు ఘంటికలను మోగిస్తున్నాయి. నిర్లక్ష్యంగా సాగుతున్న పనులతో జాతీయ రహదారి నెత్తురుడ్డుతూనే ఉంది. రాజకీయ నాయకుల జోక్యం... అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం సామాన్యుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ఇంట్లో మృత్యు ఘోష వినిపిస్తుందోనని భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


భైరవపట్నం వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన ర్యాంపు

జాతీయ రహదారి 165 పామర్రు-దిగమర్రు రోడ్డు విస్తరణ పనులను వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, ఇళ్ల స్థలాలు నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించి నిర్వహించాల్సి ఉంది. పనుల్లో ఆటంకం లేకుండా సజావుగా సాగేలా సహకరించాలని కాంట్రాక్టర్ రాజకీయ నాయకులతో రూ.ఐదు కోట్లకు డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. కేంద్ర నిధులతో చేపట్టిన 165 జాతీయ రహదారి విస్తరణ పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా గడువు ముగిసినా నేటికీ సగం పనులు కూడా పూర్తి కాలేదు. రాజకీయ నాయకుల సహకారం అధికారుల అండదండలతో బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా, ప్రమాద సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా పనులు ప్రారంభించి బాధితులపై దౌర్జన్యానికి దిగి మరీ ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టారు. అటు రాజకీయ నాయకులు ఇటు అధికారులు ముడుపులు తీసుకొని పరోక్షంగా కాంట్రాక్టర్ అక్రమాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నత్తనడకన సాగుతున్న పనుల వల్ల నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతునే ఉన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి మృతి చెందిన వారి బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యపు నీడలో ఏళ్ల తరబడి సాగుతున్న రహదారి పనుల వల్ల రోడ్డు పైకి వచ్చి సురక్షితంగా ఇంటికి తిరిగి వెళ్తామనే గ్యారెంటీ లేకుండా పోయిందని వాహనదారులు వాపోతున్నారు. హెచ్చరిక బోర్డులు లేకుండా నిర్వహిస్తున్న పనులతో ఇప్పటిరి వాహనదారులు ఎంతోమంది ప్రమాదాల బారిన పడి కొందరు మృతి చెందగా, కొందరు క్షతగాత్రులై స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయినప్పటికీ ప్రమాదాలు జరగకుండా అధికారులు సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయించలేకపోయారంటే కాంట్రాక్టర్‌పై అధికారులకు ఉన్న స్వామి భక్తిని తేటతెల్లం చేస్తుందని బాధితులు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగి కుటుంబానికి చెందిన పెద్దదిక్కును, చేతికి అంది వచ్చిన కుమారుడిని కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్‌కు సహకరిస్తూ తమ ప్రాణాలను పణంగా పెట్టే హక్కు మీకు ఎవరిచ్చారంటూ బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

జరిగిన ప్రమాదాలు


ప్రమాద హెచ్చరికలుగా ఇసుక మూటలు

కానుకల్లు వద్ద రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో రోడ్డు దాటుతున్న ఇరువురు యువతులను లారీ ఢీకొట్టిన సంఘటనలో చెల్లి అక్కడికక్కడే మృతి చెందగా అక్క కాళ్లు చేతులు విరిగిపోయాయి. నిర్లక్ష్యంగా నిలుపుదల చేసిన లారీని ఢీ కొట్టిన సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన కానుకొల్లు వద్ద రాత్రి సుమారు 8:30 గంటలకు చోటుచేసుకుంది. గుడివాడ నుంచి ద్విచక్ర వాహనంపై మండవల్లి వస్తున్న ఓ పోలీస్ రోడ్డుపై తవ్విన గోతిలో పడడంతో నడుం విరిగింది. ఈ ఘటన చిన్నపాలపర్రు వద్ద రాత్రి 8:45 గంటల సమయంలో చోటుచేసుకుంది. కల్వర్టు కోసం తవ్విన గోతిలో ద్విచక్ర వాహనం పడగా ఆ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన భైరపట్టణం శివారు వద్ద రాత్రి సుమారు 8:30 గంటలకు చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి వివాహం నిమిత్తం భీమవరం వెళు_న్న కారు ప్రత్తిపాడు స్టేజి వద్ద కల్వర్టు కోసం తవ్విన గుంటలో రాత్రి సుమారు 8:35 గంటలకు పడి కారు నుజ్జు నుజ్జు అవ్వగా అందులోని వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కల్వర్టు కోసం తవ్విన గోతిలో ఆయిల్ ట్యాంకర్ పడిన సంఘటనలో రూ.15 లక్షల విలువైన ఆయిల్ నేలపాలవ్వగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలై ఆసుపత్రిపాలైన ఘటన కైకలూరు మండలం పల్లెవాడ వద్ద రాత్రి సమయంలో చోటుచేసుకుంది. ఇలా వెలుగులోకి వచ్చినవి కొన్ని అయితే వెలుగులోకి రాని సంఘటనలు ఇంకెన్నో ఉన్నాయని బాధితులు చెబుతున్నారు.

భైరవపట్నం వద్ద లారీపై ఉన్న మిషన్‌ను దింపేందుకు ర్యాంపును ఏర్పాటు చేశారు. అనంతరం ఆ ర్యాంపును తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడమే కాకుండా ఆ ప్రాంతంలో ఎటువంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న ర్యాంపు రాత్రి వేళలో కనిపించకపోవడంతో ర్యాంపుపై నుంచి ద్విచక్ర వాహనం పడిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనతో మృతుడి అక్క, తల్లి అనాథలుగా మిగిలిపోయారు. ఈ విధంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి సామాన్య మధ్యతరగతి కుటుంబాల వారు మృత్యువాత పడుతూనే ఉన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కాంట్రాక్టర్‌పై, అధికారులపై చర్యలు తీసుకుని ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని బాధితులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌డి సత్యనారాయణను వివరణ కోరగా భైరవ పట్టణం వద్ద ఏర్పాటుచేసిన ర్యాంపుపై నుంచి ద్విచక్ర వాహనం పడిన సంఘటనలో ప్రమాదం జరిగి వ్యక్తి మృతి చెందినట్లు తన దృష్టికి రాలేదన్నారు. సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మట్టితో వస్తువుల తయారీ శిక్షణ

గీతాంజలి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు నెలల పాటు కొనసాగింపు
ప్రారంభించిన కరస్పాండెంట్ గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి - భీమడోలు

మట్టితో వంట పాత్రల నుంచి, అలంకరణ వస్తువులు తయారీ అప్పటి మాట. ఇదే క్రమంలో దీపావళి సందర్భంగా మట్టితో బాణసంచా కాల్చటానికి వినియోగించే వస్తువుల తయారీ ప్రాముఖ్యత ప్లాస్టిక్ తయారీ వస్తువుల ప్రవేశంతో సన్నగిల్లింది. ఇక వంటల విషయానికొస్తే మట్టి పాత్రల స్థానంలో అల్యూమినియం, స్టీలు వస్తువుల తయారీ చోటు చేసుకుంది. ఇక ఫ్రిజ్‌ల ప్రవేశంతో మట్టి కుండల తయారీ మూలకు చేరింది. అయినప్పటికీ దీపావళి సందర్భంగా దీపాలను వెలిగించేందుకు మట్టి ప్రమిదలను వినియోగించే ప్రక్రియ కొద్దిగా తగ్గినప్పటికీ కాలగర్భంలో కలిసిపోలేదు. ఈ దశలో మట్టి వినియోగం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు భీమడోలు కేంద్రంగా పనిచేస్తున్న గీతాంజలి విద్యాసంస్థల కార్యాలయం ముందుకు వచ్చింది. పాట్ మేకింగ్ వర్క్ షాప్ (మట్టితో వస్తువుల తయారీ శిక్షణా కార్యక్రమం)ను చేపట్టింది. ఈ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగనుంది. ప్రతి ఆదివారం మట్టి వస్తువుల తయారీలో నిష్ణాతులతో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని విద్యాసంస్థల కరస్పాండెంట్ గౌతమ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహించే దూరవిద్యా బోధన కార్యక్రమంలో భాగంగా విద్యాపరంగా ఇప్పుడు అంశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో వాటికి అదనంగా ఆత్మ రక్షణ కోసం కరాటే, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రవేశం కోసం సంగీతం, నృత్యం అంశాల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. వీటికి అదనంగా భవిష్యత్ కాలంలో నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా మట్టితో వస్తువులు తయారీ అంశాల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మారుతున్న సమాజంలో మట్టి, మట్టితో తయారుచేసిన వస్తువులకు ప్రాముఖ్యత ఉంటుందన్న ఆశాభావంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిలో భాగంగా మట్టితో పాత్రల తయారీ నుంచి, డిమాండ్ ఉన్న అనేక వస్తువుల తయారీకి అవసరమైన శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వరకు వయసుగల ఎవరైనా తమకు ఉన్న ఆసక్తి మేరకు వీటిలో పాల్గొనవచ్చని తెలిపారు. వీటి తయారీకి అవసరమైన మట్టి ఇతర వస్తువులను వీరికి శిక్షణ ఇచ్చే మాస్టారు స్వామి సమకూర్చుతారని తెలిపారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్న స్వామి మాట్లాడుతూ మట్టితో వస్తువుల తయారీకి అన్ని రకాల మట్టిలు పనికి రావన్నారు. దీనికోసం అవసరమైన ప్రత్యేక మట్టి మండల పరిధిలోని కొన్ని చెరువుల్లో మాత్రమే అందుబాటులో ఉందని, వీటిని తెచ్చుకునేందుకు ఆయా గ్రామ పంచాయతీ యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల భీమడోలు యూనిట్ బాధ్యులు సత్యనారాయణ, ఉదయ్ పాల్గొన్నారు.


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

వికలాంగుల సంక్షేమానికి సహకరించాలి

సిఐ బివి.రవికుమార్

ప్రజాశక్తి - భీమడోలు


వికలాంగుల సంక్షేమానికి ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, వారి పట్ల వివక్ష తగదని భీమడోలు సిఐ బివి.రవికుమార్ అన్నారు. సక్షమ్ (సమదృష్టి, క్షమతా వికాసం, అనుసంధాన్) మండలి ఆధ్వర్యంలో భీమడోలులోని సత్యేంద్ర పాఠశాల కేంద్రంగా మండలి స్థాపన దివస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐతో పాటు అతిథులుగా భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్, లయన్స్ క్లబ్ భీమడోలు శాఖ సభ్యులు పివి.సత్యనారాయణ, విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.నాగభూషణం, సక్షమ్ మండలి జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.జగన్నాథం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న వికలాంగులకు సేవలందిస్తున్న వివిధ సేవా సంస్థలకు చెందిన ప్రతినిధులను ముఖ్యఅతిథితో పాటు ఇతర అతిథులు సత్కరించారు.


మాట్లాడుతున్న సిఐ రవికుమార్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

31 ఏళ్ల క్రితం ఒకే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులందరూ వివిధ రంగాల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ఒకే చోట కలుసుకుని ఆత్మీయ సమావేశం నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని రిటైర్డ్ ఉపాధ్యాయుడు గద్దె అమరేశ్వరరావు అన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పోతునూరు గ్రామానికి పూర్వ విద్యార్థి టిడిపి జిల్లా నేత నున్న లక్ష్మణ్‌బాబు, మరో పూర్వ విద్యార్థి అత్యం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు గద్దె అమరేశ్వరరావు, వెన్న రాజారమేష్, బెజవాడ శివకుమారి, చమలమూడి ఆనందకుమారిలను ఘనంగా సన్మానించి గజమాల, పూలదండ, బొకేలను అందించారు. అనంతరం అందరూ కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగన్నబోయిన శంకరరావు, అటవీశాఖ ఉద్యోగి అప్పారావు, పోతునూరు విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది, రామారావు పేట పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులు

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు పోరాడాలి

ప్రజాశక్తి - నిడమర్రు


పత్యేక హోదా, విభజన హామీలు అమలు చేసేలా టిడిపి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో సంక్షేమ పథకాలే కాదు రాష్ట్ర అభివృద్ధి కావాలని ప్రజలు నిరూపించారన్నారు. వైసిపి ప్రభుత్వం నిరంకుశత్వం మొండి వైఖరి వల్ల టిడిపి కూటమి ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. గత ఎన్నికల్లో వైసిపి అధినేత జగన్ 25 పార్లమెంటు సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా తీసుకొస్తానంటే 22 సీట్లు ఇచ్చారన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అంశం అని కేంద్ర ప్రభుత్వం బిజెపి అంటే రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే రాష్ట్రంలో వైసిపి, టిడిపి పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కేంద్రంలో బిజెపి మైనార్టీ ప్రభుత్వానికి టిడిపి, జనసేన పార్టీలతో పాటు వైసిపి మద్దతిస్తానంటుందన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా కోసం, విభజన హామీలు అమల కోసం, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న పార్టీలను కలుపుకొని ప్రజల ఆకాంక్ష కోసం టిడిపి కూటమి పోరాడాలన్నారు. ఈ సమావేశంలో వెలగలేటి మోహన, లావేటి చంద్రరావు, కంచం వరప్రసాద్, కానూరు రాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

మహిళలకు అండగా టిడిపి

పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


టిడిపి ప్రభుత్వంతోనే లా అండ్ ఆర్డర్ అదుపులో ఉంటుందని, తెలుగుదేశం పార్టీ మహిళలకు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘల దేవి అన్నారు. ఒక మహిళపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చిన 36 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసి హోం మంత్రి వంగలపూడి అనిత తన మార్కును చూపించుకున్నారు. ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కొయ్యలగూడెంలోని మేఘలదేవి నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన సుచరిత అనే మహిళపై అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేసిన నిందితులను 36 గంటల్లోనే అరెస్టు చేసినట్లు మేఘల దేవి తెలిపారు. హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న హోంమంత్రి 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసి కోర్టుకు పంపుతామని తెలిపారని, కాని అంతకుముందే 36 గంటల్లో నిందితులను అరెస్టు చేసి తన మార్క్ చూపించారన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సిఎం చంద్రబాబు బాధితురాలి కుటుంబానికి రూ.పది లక్షల ఆర్థిక సాయం అందించారన్నారు. హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి రాష్ట్రంలోని శాంతి భద్రతలను కాపాడుతూ లా అండ్ ఆర్డర్ అదుపులో ఉంచే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్న వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న మురగన్

104 వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ 104 వాహన స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురగన్ ఆదివారం ఏలూరు జిల్లా గుడివాకలంక, చాటపర్రుకు సంబంధించిన 104 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న పరికరాలు, మందులు, లాగ్ పుస్తకాలు పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా 104 అధికారి తేనే విజయ్‌బాబు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ లంకా హరీష్, కోసనం కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.


పార్థసారథితో కాపు సంఘం నేతలు

మంత్రి పార్థసారధిని కలిసిన కాపు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆగిరిపల్లి కాపు సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు సంఘం ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. కాపు సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణం, రంగా విగ్రహం ఏర్పాటు, కాపులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు వి.లక్ష్మీనారాయణ, ఎస్.రంగారావు, బి.శివాజీ, వి.అచ్యుతరావు, ఎస్.రవికిరణ్, ఎం.మహేష్, ఎ.శ్రీనివాసరావు, బాబి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎ చింతమనేనిని దుగ్గిరాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా వాటిని సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు.

రామచంద్రపురంలో నీలాలమ్మ జాతర

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లమాడు పంచాయతీ పరిధి రామచంద్రపురంలో గ్రామ దేవత నీలాలమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. చాలా కాలం తరువాత నిర్వహిస్తున్న ఈజాతర కార్యక్రమానికి గ్రామ ఆడపడుచులు, చుట్టాలు, బంధువులు, స్నేహితులు ఇలా దేశ విదేశాల్లో ఉన్నవారంతా ఒక్కసారిగా సొంతూర్లు రావడంతో పల్లె పండుక వాతావరణంతో కళకళలాడింది. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వట్టి పవన్‌కుమార్ తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.